గేటు పడితే నరకమే!

- కొండపల్లి, గుంటుపల్లి వద్ద రైల్వే గేట్లు
- రోజుకు వందసార్లకు పైగా పడుతున్న గేట్లు
- అత్యవసర సమయంలోనూ ఇబ్బందులు
- ప్రతిపాదనల దశ దాటని ఆర్‌యూబీ


కొండపల్లి వద్ద రైల్వే గేటు పడటంతో నిలిచి పోయిన వాహనదారులు


కొండపల్లి రైల్వే గేటు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న రైల్వే ప్రాజెక్ట్ ఇంజినీర్ శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు (ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఈలప్రోలు గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో కొండపల్లి, గుంటుపల్లి వద్ద ఉన్న రైల్వే గేట్లు ఆ గ్రామ ప్రజల రాకపోకలకు ఆటంకంగా మారాయి. గ్రామానికి రెండు వైపులా గేట్లు ఉండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. న్యూఢిల్లీ, చెన్నై వరకు ప్రధాన రైల్వే మార్గం కావడం, ఎన్టీటీపీఎస్‌కు బొగ్గు రవాణా రైళ్ల రాకపోకలు సాగించడంతో రోజులో వందసార్లకు పైగా గేట్లు పడతాయి. గేట్లతో అత్యవసర సమయాల్లో ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. 2023లో కొండపల్లి గేటు వద్ద కేంద్ర రైల్వే శాఖ సేతుబంధన్ పథకంలో రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యుబీ) నిర్మాణానికి ప్రతిపాదనలు పంపింది. అయితే ఆ పథకం ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. దీంతో ఆయా గ్రామస్తులు రాకపోకల సమయంలో రైల్వే గేటు పడితే నరకాన్ని చూస్తున్నామని వాపోతున్నారు.

రోజుకు వందసార్లకు పైగా గేట్ల మూత

న్యూఢిల్లీ, హౌరా నుంచి చెన్నై మార్గమధ్యంలో కొండపల్లి రైల్వేస్టేషన్ ఉంది. ఈ మార్గంలో రైళ్లు, ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ప్రయాణికులతో వెళ్లే రైళ్లతో పాటు వివిధ ప్రాంతాలకు సరుకు రవాణా చేసే గూడ్స్ రైళ్లు, ఎన్టీటీపీఎస్‌కు బొగ్గు రవాణా చేసే గూడ్స్ రైళ్లు మొత్తం సుమారు 130 వరకు ప్రతి రోజు రాకపోకలు సాగిస్తాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఎన్టీటీపీఎస్ బొగ్గు రవాణా రైళ్లు గేటుకు కూతవేటు దూరంలో ఉండటంతో నెమ్మదిగా వెళ్లడంతో గేటు తీసేందుకు అరగంటకు పైగా సమయం పడుతోంది. ఒక్కో సమయంలో రెండు, మూడు రైళ్లు వెళ్లే వరకు గేటు తీయడం లేదు.

గేట్లు పడితే అవస్థలే

కొండపల్లి రైల్వేస్టేషన్ 1916లో నిర్మించినప్పటి నుంచి గ్రామస్తులకు రైల్వేగేట్ల తిప్పలు తప్పడం లేదు. వివిధ పనులపై విజయవాడ, కొండపల్లి, ఇబ్రహీంపట్నానికి గుంటుపల్లి, కొండపల్లి వద్ద ఉన్న రెండు రైల్వే గేట్లు దాటుకుని రావాల్సిందే. అత్యవసర సమయాల్లో, వైద్యశాలకు వెళ్లే సమయాల్లో సైతం రైల్వే గేట్లు అడ్డుగా మారాయి. 108 వాహనాలు సైతం కదలలేని పరిస్థితులు నెలకొన్నాయి. రెండు ట్రాక్‌లపై రెండు రైళ్లు వెళ్లే సమయాల్లో అర గంటకు పైగా గేట్లు మూసి ఉంచడంతో అంబులెన్స్‌లో రోగులకు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఏళ్ల తరబడి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం (ఆర్వోబీ) చేయాలని పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలను గ్రామస్తులు కోరినప్పటికీ ఫలితం లేదు.

స్థల సేకరణకు కొలతలు

కేంద్ర ప్రభుత్వ కొండపల్లి రైల్వే గేటు వద్ద సేతుబంధన్ పథకం కింద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు 2023 సెప్టెంబర్‌లో ముందుకొచ్చింది. రైల్వే ప్రాజెక్ట్ ఇంజినీర్ శ్రీనివాసరావు ఆర్‌యూబీ నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అప్పటి కొండపల్లి మున్సిపల్ అధికారులతో ఆర్‌యూబీ నిర్మాణంపై చర్చలు జరిపారు. అవసరమైన స్థలం సేకరణకు కొలతలు తీశారు. రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. ఆ తర్వాత కాలంలో పనులు ముందుకు సాగలేదు. స్థానిక నాయకులు, కౌన్సిలర్లు ఆర్‌యూబీపై రైల్వే ఇంజినీరింగ్ అధికారులను అప్పుడప్పుడు కలిసి పనులు ప్రారంభించాలని కోరుతున్నా ప్రయోజనం లేదు.



ఆర్‌యూబీ పనులు ప్రారంభించాలి

నా భార్య కుమ్మరి నాగసుధ 7వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు. మా వార్డులో నిర్మించాల్సిన ఆర్‌యూబీ నిర్మాణంపై రైల్వే ప్రాజెక్ట్ ఇంజనీర్ శ్రీనివాసరావును పలుమార్లు కలిశాం. పనులు ప్రారంభించాలని కోరాం. ప్రాజెక్ట్ అంచనా ప్రక్రియ జరుగుతుందన్నారు. డీపీఆర్ తయారు కాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

– కుమ్మరి శ్రీనివాస్, 7వ వార్డు, కొండపల్లి



అరగంట వరకు తీయరు

గ్రామ ప్రజలు ప్రతి పనికి కొండపల్లి, ఇబ్రహీంపట్నం రావాల్సి ఉంది. అత్యవసరమైతే విజయవాడ వెళ్తాం. ఎటు వెళ్లాలన్నా గేట్ల సమస్య ఉంది. అత్యవసర సమయాల్లో అరగంట వరకు గేట్లు తీయరు. ఏళ్ల తరబడి రైల్వే గేట్లతో నరకం అనుభవిస్తున్నాం. రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే ఓవర్ బ్రిడ్జి ఏదో ఒకటి త్వరగా నిర్మించాలని కోరుతున్నాం.

– తులిమిల్లి ఏసు, ఈలప్రోలు

క్లుప్తంగా

ఏఓ శైలజకు సన్మానం



కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): మండల వ్యవసాయ శాఖాధికారిగా విధులు నిర్వహించిన డి.శైలజ బదిలీపై మచిలీపట్నం వెళ్లారు. గన్నవరం వ్యవసాయ శాఖలో ఏఓగా పనిచేసిన రజని ఇబ్రహీంపట్నం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఏఓ శైలజకు కొటికలపూడి సర్పంచి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెంటపల్లి నాగరాజు ఆధ్వర్యంలో గురువారం రైతులు ఆమెను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. గ్రామంలో వ్యవసాయ రంగానికి, రైతులకు ఆమె చేసిన సేవలను కొనియాడారు. గ్రామ సచివాయలంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు చేపట్టి ఇటీవలి కాలంలో కట్టుబడిపాలెంకు బదిలీ అయిన పార్వతిని కూడా సత్కరించారు. గ్రామ సర్పంచి రెంటపల్లి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి జానీబాషా, వీఏఏ కిరణ్మయి, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల బైక్ ర్యాలీ



తిరువూరు: తిరువూరు నగర పంచాయతీలో పని చేసే కార్మికులు తమ సమస్యలు తెలుపుతూ గురువారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ నెల 15 తర్వాత చేపట్టే నిరవధిక సమ్మెకు ప్రజలు సహకరించాలని కోరుతూ నగర పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ద్విచక్ర వాహనాలపై ప్రదర్శన నిర్వహించారు. తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైనందున సమ్మెకు దిగుతున్నట్లు సీఐటీయూ నాయకులు బి. వెంకటేశ్వరరావు, కందుల శ్రీను తదితరులు తెలిపారు.

ఆదర్శ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



తిరువూరు: ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించినందున విద్యార్థులను చేర్పించాలని ఎ.కొండూరు ఎంఈఓ-2 కేశవరావు కోరారు. గురువారం కోడూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రత్యేకతలను వివరిస్తూ పాఠశాల సిబ్బంది రూపొందించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వం అందిస్తున్న పలు సదుపాయాలను వివరించి పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కోడూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శరత్‌బాబు, సర్పంచి సురేష్, ఉపాధ్యాయులు రాంప్రదీప్, నాగేంద్ర, నాగపండు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



చాట్రాయి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ బ్రహ్మచారి తెలిపారు. గురువారం సి-గుడిపాడు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం రుచికరంగా కూరలు తయారు చేసి విద్యార్థులకు అందించాలని, రుచికరంగా తయారు చేస్తేనే ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాలల్లో భోజనం చేస్తారని చెప్పారు. ఉప్పుతో బియ్యాన్ని కడిగి అన్నం వండాలని సూచించారు. హైస్కూల్ హెచ్ఎం ఎ.బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం



ఆగిరిపల్లి: విద్యుత్ అదాలత్ ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. గురువారం ఆగిరిపల్లిలో పొన్నం కల్యాణ మండపంలో విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలు తెలుపుకునేందుకు విద్యుత్ అదాలత్ మంచి పరిష్కార వేదిక అని అన్నారు. ఈ సందర్భంగా ఏడుగురు విద్యుత్ వినియోగదారులు అర్జీలను అధికారులకు అందజేశారు. జిల్లా అధికారి టి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ, సీజీఆర్‌ఎఫ్ సాంకేతిక సభ్యులు ఎస్. శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు సీహెచ్ శ్రీనివాసరావు, ఏఈ రామారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఆగిరిపల్లి: మంత్రి కొలుసు పార్థసారథి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం మంత్రి కొలుసు పార్థసారథి మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో రూ.30 లక్షలతో నిర్మించే యాదవుల కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. రూ.1.50 కోట్లతో ఈదర నుంచి శోభనాపురం రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో రూ.30 కోట్లతో రోడ్ల మరమ్మతులు చేశామని చెప్పారు. ఏడాది కాలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్కి రూ.170 కోట్లు ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి



చాట్రాయి: ఉపాధి కూలీలకు బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చీపురుగూడెం మర్రిబంధం గ్రామాల్లో ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల నుంచి వేతనాలు చెల్లించకపోతే వారి కుటుంబాల పోషణ ఎలా అని ప్రశ్నించారు. దీంతో కూలీలు నానా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



ఇబ్రహీంపట్నంలో అక్షరాభ్యాసం చేసిన చిన్నారులతో సూపర్ వైజర్ మాధవి, కౌన్సిలర్ భూలక్ష్మి : పొందుగలలో సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

జి.కొండూరు: అంగన్‌వాడీల్లో ప్రవేశాలపై సిబ్బంది దృష్టి సారించాలని ఐసీడీఎస్ మైలవరం ప్రాజెక్ట్ సీడీపీఓ కె.పుష్పలత అన్నారు. మన అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని కోడూరు అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పుష్పలత సాముహిక అక్షరాభ్యాసం చేయించారు. సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. సెక్టార్ సూపర్ వైజర్ ఐ.అన్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మైలవరం: మైలవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పుల్లూరు, పొందుగల, చంద్రాల తదితర గ్రామాల్లో చిన్నారులకు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లోని కేంద్రాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. పొందుగల అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ పుష్పలత పర్యవేక్షణలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత కార్యక్రమంలో పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ప్రీ స్కూల్ ప్రాముఖ్యతను తల్లులకు వివరించారు. కార్యక్రమంలో పోషక సఖిలు, తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● **ఇబ్రహీంపట్నం:** మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాస కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ మాధవి, 17వ వార్డు కౌన్సిలర్ ముప్పసాని భూలక్ష్మీ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్పులు తప్ప అభివృద్ధి లేదు

విలేకరుల సమావేశంలో సీపీఎం నేతల ధ్వజం

తిరువూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాది పాలనలో ప్రజలకు అప్పులు తప్ప అభివృద్ధి కనిపించడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. నాగేంద్రప్రసాద్ విమర్శించారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రావడానికి ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన వాగ్దానాలతో పాటు సూపర్ సిక్స్ పథకాల అమలుపై కూటమి పాలకులకు చిత్తశుద్ధి లోపించిందన్నారు. 178 వాగ్దానాలు చేసిన పాలకులు కేవలం 16 వాగ్దానాలు అమలు చేయడం శోచనీయమన్నారు. ప్రధానంగా మహిళలకు ఉచిత బస్ సదుపాయం, నిరుద్యోగులకు నెలవారీ భృతి, గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ, ఆడబిడ్డ నిధికి నెలకు రూ.1500, యువతకు 20 లక్షల ఉద్యోగాల వంటి కీలక హామీల అమలులో వాయిదాలు వేయడం తగదన్నారు.

ఒక్క హామీ అమలు చేయని ఎమ్మెల్యే కొలికపూడి

తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సైతం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో ఒక్కటీ నెరవేర్చలేదని, గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై వంతెన నిర్మాణం, తిరువూరులో పైలెట్ మంచినీటి పథకం, ఎ.కొండూరు మండలంలో కిడ్నీ రోగులకు శుద్ధి చేసిన కృష్ణా జలాల సరఫరా, తిరువూరులో ఉపాధి కల్పనకు పరిశ్రమల ఏర్పాటు, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు వంటి హామీలను ఎమ్మెల్యే విస్మరించారన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎస్. నాగేశ్వరరెడ్డి, ఎస్‌వీ భద్రం, ఆకుల రవి, బి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మిక నేత సుధాకరరావుకు నివాళి

తిరువూరు: కార్మిక నాయకుడిగా బత్తుల సుధాకరరావు తుది శ్వాస వరకు కార్మికుల కోసమే పోరాడారని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ తిరువూరు డిపో కార్యదర్శి కేవీ రావు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బత్తుల సుధాకరరావు పదో వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. సుధాకరరావును కార్మికులు ఆదర్శంగా తీసుకోవాలని, పదవుల కంటే సేవా దృక్పథమే అభిమతంగా పనిచేయాలని కేవీ రావు సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వల్లభనేని రవీంద్ర, ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ నాయకులు, కార్మికులు, సుధాకరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వినియోగం అనర్థం

సైకియాట్రిస్ట్ స్వరాజ్యలక్ష్మి



ఇబ్రహీంపట్నం: మాదక ద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి అనర్థమని ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి అన్నారు. జూన్ 26న మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ ప్రభుత్వ వైద్యశాల, వాసవ్య మహిళా మండలి మెంటల్ హెల్త్ ప్రాజెక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు ఇబ్రహీంపట్నంలో గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వాసవ్య సెంటర్ వారు మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్తుకు బానిసైన వారు డి అడిక్షన్ సెంటర్‌లో చేరి చికిత్స పొందవచ్చని చెప్పారు. ఎటువంటి ఖర్చు లేకుండా పూర్తిగా ఉచితంగా చికిత్స తీసుకోవచ్చన్నారు. సైకాలజిస్ట్ భవానీ, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కేశవ, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా కిట్లు పంపిణీ


మునుకుళ్ల జెడ్పీ హైస్కూల్లో విద్యా కిట్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మునుకుళ్ల(తిరువూరురూరల్): నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా మండలంలోని మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం విద్యా కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్, సర్పంచి సిరికొండ కుమారి, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, గ్రామ ప్రముఖులు దుబ్బాకు వెంకటేశ్వర్లు, వెదురు వెంకటనర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన విద్యా సంవత్సరానికి విద్యా కిట్లను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యు. గురునాథం విద్యార్థులకు అందజేశారు. రిటైర్డ్ ఎంఈఓ యూ. మోహనరావు, కె.కనకదుర్గ, ఫిజికల్ డైరెక్టర్ కె. వెంకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తైక్వాండోలో జూపూడి బాలికకు ఐదు స్వర్ణ పతకాలు



ఇబ్రహీంపట్నం: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జూపూడి గ్రామానికి చెందిన కలతోటి దామిని ఐదు స్వర్ణ పతకాలు సాధించింది. ఈనెల 9, 10, 11 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో అండర్ 59 కేజీల విభాగంలో క్యురేగీ, పూమ్‌సే తదితర విభాగాల్లో ఆమె ఈ ఘనత సాధించింది. ఈనెల 23 నుంచి ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ బాలిక గుణదల డాన్‌బాస్కో పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నట్లు తల్లిదండ్రులు రమేష్‌బాబు, స్నేహలత తెలిపారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

సీపీఎం నేతల విమర్శ


మాట్లాడుతున్న ఎన్‌సీహెచ్ శ్రీనివాస్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం నాయకులు విమర్శించారు. కొండపల్లి టౌన్ సమావేశం గురువారం జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్‌పై ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందిందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు పగులగొట్టాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే మంత్రిగా ఉన్న లోకేష్ నోరు మెదపకపోవడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలకు కరెంట్ బిల్లు షాక్ కొడుతోందని చెప్పారు. స్పీడ్ ఆఫ్ బిజినెస్ పేరుతో 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు మార్చే విధానం విరమించుకోవాలన్నారు. పట్టణానికి ఆనుకుని కృష్ణానది ఉన్నప్పటికి తాగునీటి కష్టాలు తీర్చే నాథుడు లేడని విమర్శించారు. కొండపల్లి టౌన్ కార్యదర్శి మహేష్, సభ్యులు కొండలరావు, బాషా తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు సర్కిల్‌లో కార్డెన్ సెర్చ్


తిరువూరు మండలం వామకుంట్లలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరువూరు: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు తిరువూరు సర్కిల్‌లో పోలీసులు గురువారం పలు గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తిరువూరు మండలంలోని వామకుంట్ల, గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెం, విస్సన్నపేట మండలం చంద్రుపట్ల తండా, కొర్రా తండా, పెద్ద తండా గ్రామాల్లో తెల్లవారు ఝాము నుంచి తనిఖీలు నిర్వహించారు. గతంలో సారా తయారీ, అమ్మకాలకు పాల్పడే వారి నివాసాలను, అనుమానితుల ఇళ్లను సోదా చేశారు. గంజాయి, సారా, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగం చేస్తున్న వ్యక్తులపై నిఘా ఉందని, నేరాల నియంత్రణకు జరిగే కార్డెన్ సెర్చ్‌కి ప్రజలు సహకరించాలని మైలవరం ఏసీపీ ప్రసాదరావు కోరారు. సీఐ గిరిబాబు, ఎస్ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, పోలీస్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలి

నూజివీడు జూనియర్ సివిల్ జడ్జి అనూష


సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అనూష

ఆగిరిపల్లి: 14 సంవత్సరాల లోపు పిల్లలను పనికి పంపించడం చట్ట ప్రకారం నేరమని, బాల కార్మిక వ్యవస్థను రూపు మాపాలని నూజివీడు జూనియర్ సివిల్ జడ్జి ఒ.అనూష అన్నారు. వట్టిగుడుపాడులోని మోహన్ స్పిన్‌టెక్స్ ఫ్యాక్టరీ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నూజివీడు జూనియర్ సివిల్ జడ్జి అనూష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలు ప్రమాదకరంగా ఇటుక బట్టీల్లో, కర్మాగారాల్లో పని చేయడం కనిపిస్తోందని ఆవేదన చెందారు. 14 సంవత్సరాల లోపు పిల్లలతో పనిచేయించడం నేరమన్నారు. అలా ప్రోత్సహించే వారికి కూడా శిక్ష విధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ కె.శ్యాంబాబు, న్యాయవాదులు బసవరాజు రామకృష్ణ, ఎస్‌కేడీ ప్రసాద్, గోపీనాథ్, ఫ్యాక్టరీ డైరెక్టర్ సునీల్ పాల్గొన్నారు.

తల్లికి వందనం కాదు.. వంచన పథకం

నూజివీడు: తల్లికి వందనం కాదు వంచన పథకమని యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోళ్ల పవన్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కోతల ప్రభుత్వంగా మారిందని, ఈ విషయం తల్లికి వందనం పథకం అమలులో తేటతెల్లమైందన్నారు. కూటమి ప్రభుత్వ హామీలు చూస్తే కోటలు దాటాయి తప్ప అమలులో మాత్రం గడపలు దాటలేకపోతున్నాయన్నారు. నీకు 15 వేలు, నీకు 15 వేలు, నీకు 15 వేలు అంటూ నాడు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టి నేడు 13 వేలతో సరిపెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ధ్వజమెత్తారు. ఒక్కొక్కరికీ 15 వేలు జమ చేస్తానని చెప్పి తల్లులను వంచనకు గురి చేయడంలో కూటమి ప్రభుత్వం ఘనతను సొంతం చేసుకుందని విమర్శించారు.